నమస్తే తెలంగాణ
# జనగామ
5 | సోమవారం 6 మే 2024 | JANAGAON



పెద్దవంగరలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు, పక్కన మాజీ స్పీకర్ మధుసుదనాచారి, ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

## అబద్ధాల్లో రేవంత్‌కు ఆస్కార్ ఇవ్వాలి

- ఒట్లు దేవుళ్లపై కాదు.. నీ బిడ్డపై పెట్టు
- పెద్దవంగరలో ప్రచారంలో మాజీ మంత్రి దయాకర్‌రావు
- లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు బీఆర్‌ఎస్‌దేనని స్పష్టం

పెద్దవంగర, మే 5 : ఆరు గ్యారెంటీలపై సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్లు వేయడం కాదు, నీ బిడ్డపై ఒట్టేసి చెప్పాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం పెద్దవంగర మండలంలోని అవుతాపురం, పోచంపల్లి, గంట్లకుంట, కొరిపెల్లి, వడ్డెకొత్తపల్లి, పెద్దవంగర, చిన్నవంగర, చిట్యాల, బొమ్మకల్లు గ్రామాల్లో ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. అబద్ధాల్లో సీఎం రేవంత్‌రెడ్డికి ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చన్నారు. రేవంత్‌రెడ్డి అక్రమాల పుట్ట అని, ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయాడన్నారు. కడియం శ్రీహరిది ఏ కులమో ప్రత్యక్షంగానే రేవంత్‌రెడ్డి తేల్చి చెప్పారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే బీఆర్‌ఎస్ లేని లోటు కనిపిస్తోందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి 8 నుంచి 10 సీట్లు వస్తాయని సర్వేలు చెబుతున్నాయన్నారు. ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీని మోసం చేసిన కడియం శ్రీహరికి రాజకీయ సమాధి తప్పదన్నారు. బీజేపీలో చేరిన అరూరి రమేశ్ వర్ధన్నపేట ప్రజలను మోసం చేశాడని, మోసం చేసిన వాళ్లకు ఓటుతో సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హా మీలు నెరవేరాలంటే బీఆర్‌ఎస్ తప్పక గెలవాలని అన్నారు. కార్యక్రమంలో వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్య, సంజయ్, నాయకులు రామచంద్రయ్యశర్మ, యాదగిరిరావు, సునీల్‌కుమార్ రెడ్డి, సుధీర్‌కుమార్, మనోహర్‌గౌడ్, విజయ్‌పాల్‌రెడ్డి, కృష్ణమూర్తి, సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, జ్ఞానేశ్వరాచారి, సమ్మయ్య, వేణుగోపాల్‌రావు, ప్రదీప్‌రావు, ఉష య్య, శ్రీనివాస్, రాము, వెంకట్రామయ్య, వెంకన్న, రవి, హరీశ్‌యాదవ్ పాల్గొన్నారు.



ఇంటింటా ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్, జడ్పీచైర్ పర్సన్ బిందు

## కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమే..


- తెలంగాణకు రక్ష బీఆర్‌ఎస్సే..
- ఎంపీ అభ్యర్థి కవితను భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, జడ్పీ చైర్‌పర్సన్ బిందు

బయ్యారం, మే 5: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే బతుకులు ఆగమేనని ఎమ్మెల్యే హరిప్రియానాయక్, జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు అన్నారు. ఆదివారం మండలంలోని సింగారం, కొత్తపేట, గంధంపల్లి, సంతులాల్‌పోడు తండా, బంజరతండా, జగ్గుతండా, జఫరాబాద్, ఇర్సులాపురం, రామగుండ, బయ్యారంలోని బీసీకాలనీ, రుద్రమదేవి వీధిల్లో వారు స్థానిక నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఐదు నెలలు దాటినా పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రానికి బీఆర్‌ఎస్, కేసీఆరే శ్రీరామ రక్ష అని, బీఆర్‌ఎస్ హయాంలోనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని అన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ఢిల్లీలో కొట్లాడేందుకు ఎంపీగా కవితను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తాత గణేశ్, వైస్ చైర్మన్ గంగుల సత్యనారాయణ, మండల నాయకులు ఏనుగుల ఐలయ్య, అంగోత్ శ్రీకాంత్, యూత్ అధ్యక్షుడు బానోత్ లక్ష్మణ్‌నాయక్, ప్రచార కార్యదర్శి రేపాకుల వెంకన్న, మాజీ సర్పంచ్ వాంకుడోత్ జగన్, బండమీది సంపత్, జర్పుల శ్రీను పాల్గొన్నారు.

### అభివృద్ధి కావాలా? విధ్వంసం కావాలా?

– బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్


అభివృద్ధి అంటే బీఆర్‌ఎస్ అని, విధ్వంసం అంటే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలని.. మరి అభివృద్ధి కావాలా.. విధ్వంసం కావాలా ఆలోచించాలని బీఆర్‌ఎస్ కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను గారడీ చేసి అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్లు వేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను నమ్మి మరోసారి మోసపోయేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండి ఒక్క మెడికల్ కాలేజీ కూడా ఇవ్వలేదన్నారు. ఎంపీగా ఉన్న బండి సంజయ్ చేసింది చెప్పలేకనే దేవుళ్ల పేరుతో రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి గెలిచిన సోయం బాపూరావు, బండి సంజయ్, అరవింద్, కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు ఏనాడూ తెలంగాణకు కావాల్సిన పనుల గురించి పార్లమెంట్‌లో మాట్లాడిన దాఖలాల్లేవని విమర్శించారు. రాష్ట్రానికి 23 నవోదయ విద్యాలయాలు రావాల్సి ఉంటే బండి సంజయ్ మాట్లాడే ప్రయత్నం కూడా చేయలేదని చెప్పారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో ఎల్కతుర్తి-సిద్దిపేట నేషనల్ హైవే కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తే ఇప్పుడు పనులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. అభివృద్ధిని ఆకాంక్షించి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్



ముల్కనూరు రోడ్‌షోలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు



ముల్కనూరులో బీఆర్‌ఎస్ రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన ప్రజలు

- కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించండి
- ఝూటామాటల రేవంత్‌రెడ్డికి బుద్ధి చెప్పండి
- కాంగ్రెస్ అంటేనే కరువు, మోటర్లు కాలిపోవడం
- అక్షింతలు పంచితే బీజేపీకి ఓటేస్తామా?
- తెలంగాణ కోసం గళ మెత్తే బీఆర్‌ఎస్‌కు ఓటేయండి

# వినోదన్నను ఆశీర్వదించండి

**వికాసం అంటే అభివృద్ధి.. అభివృద్ధి అంటేనే వినోద్ • ముల్కనూరు రోడ్‌షోలో మాజీ మంత్రి హరీశ్‌రావు**

వికాసం అంటే అభివృద్ధి, అభివృద్ధి అంటేనే వినోద్ అని.. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి వినోదన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ఏర్పాటుచేసిన రోడ్ షోలో బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావుతో కలిసి ఆయన ప్రచారం చేశారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ వాటిని అమలు చేయలేదని.. అందుకే రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్టు వేస్తున్నాడని, ఈ ఝూటా మాటల రేవంత్‌కు బుద్ధిచెప్పాలని కోరారు. పెట్రోల్, నిత్యావసర ధరలు పెంచి ప్రజలపై భారం మోపిన బీజేపీ ఇప్పుడు అక్షింతలు, దేవుళ్ల చిత్రపటాలు పంచుతూ రాజకీయం చేస్తోందని, ఆ పార్టీకి ఓటేస్తే తెలంగాణ వెనుకబడిపోతుందని, హక్కుల కోసం గళ మెత్తే వినోద్‌కుమార్‌ను ఆశీర్వదించాలని హరీశ్‌రావు కోరారు.

– భీమదేవరపల్లి, మే 5

సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన బాండ్‌పేపరు బౌన్స్ అయిందని, అందుకే ఆయన ఎక్కడికి వెళ్తే అక్కడి దేవుళ్లపై ఒట్టు వేస్తున్నారని, ఒకవేళ హుస్నాబాద్‌కు వస్తే కొత్తకొండ వీరభద్రస్వామిపై ఒట్టు వేసేటోడని హరీశ్‌రావు చమత్కరించారు. 'రాష్ట్రంలో ఒక వైపు ఎండలు మండుతున్నయ్.. మరోవైపు కాంగ్రెసోళ్ల, బీజేపోళ్ల అబద్ధపు ప్రచారాలు, మోసపూరిత వాగ్దానాలు విని తెలంగాణ ప్రజల గుండెలు మండుతున్నయ్.. ఆరు గ్యారెంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని బాండ్ పేపర్ రాసిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అమలు చేసిందో ఇక్కడికి వచ్చిన అక్కాచెల్లెమ్మలే చెప్పాలి.. అధికారంలోకి వస్తే వృద్ధాప్య పింఛన్ రూ.2వేల నుంచి రూ.4వేలకు పెంచుతామన్నరు.. తీరా ప్రభుత్వం వచ్చాక జనవరి నెలలో ఉన్న రూ.2వేల పింఛను కూడా ఇవ్వలే.. వెనుకటికో సామెత ఉన్నది.. అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోయిందట.. ఈ నెల 9 తర్వాత రైతు భరోసా ఇస్తడట.. రూ.15వేలు ఇవ్వకుండా పది వేలు ఇస్తే అది రైతుబంధు అయితది తప్పితే రైతు భరోసా కాద'ని ఎద్దేవా చేశారు. రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ చెప్పిందని, మాఫీ కాని వాళ్లంతా బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. ముల్కనూరు ముద్దుబిడ్డ అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇస్తామని చెప్పి మొండిచేయి చూపారన్నారు. ప్రవీణ్‌రెడ్డికి ఇచ్చిన గ్యారెంటీనే అమలు చేయలేదు.. ఆరు గ్యారెంటీలు వీళ్లు అమలు చేస్తారా అని ప్రశ్నించారు. ముల్కనూరు ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ దెబ్బతీసిందన్నారు. ఈ గ్రామబిడ్డ సుధీర్‌కుమార్‌కు కేసీఆర్ బీఆర్‌ఎస్ వరంగల్ ఎంపీ టికెట్ ఇచ్చి బరిలో నిలిపారని గుర్తుచేశారు. భీమదేవరపల్లి మండలాన్ని గౌరవించింది.. ముల్కనూరును ప్రేమించింది కేసీఆర్ మాత్రమేనని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రివర్స్ గేర్‌లో నడుస్తున్నదని.. కాంగ్రెస్ అంటేనే కరువని, కాంగ్రెస్ అంటేనే ఎవుసం మోటర్లు కాలిపోవుడని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేకనే తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకువచ్చిన కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ అసెంబ్లీలో కొట్లాడుతానని హామీ ఇచ్చారు. బీజేపీకి ఓటేస్తే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఆకాశాన్నంటాయని, జీఎస్టీ అమలు చేసి నిత్యావసర ధరలను పెంచడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీలను ప్రపంచ కుబేరులను చేసి రైతులకు మొండిచేయి చూపిందన్నారు. అక్షింతలు, దేవుళ్ల చిత్రపటాలు పంచిపెడితే ఓట్లు రావని, బీజేపీకి ఓటేస్తే తెలంగాణ రాష్ట్రం వెనుకబడుతుందన్నారు. అభివృద్ధి కావాలన్నా.. మన హక్కులు మనకు దక్కాలన్నా వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

### వినోద్ గెలిస్తేనే తెలంగాణకు న్యాయం

పార్లమెంటులో తెలంగాణ కోసం గళం విప్పాలంటే వినోదన్న తప్పక గెలవాలని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ అన్నారు. వినోదన్నకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపిస్తే తెలంగాణకు తప్పక న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతే రాష్ట్రంలో కష్టాలు మొదలయ్యాయన్నారు. కరెంటు ఉంటున్నదా.. రైతుబంధు, రైతుబీమా పడుతున్నాయా అని ప్రజలను అడిగారు. అనేక రంగాల్లో మనం వెనుకబడిపోతున్నామని తెలిపారు. రోడ్‌షోలో ఎంపీపీ జక్కుల అనిత, జడ్పీటీసీ వంగ రవి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మండల సురేందర్, ఎంపీటీసీలు బొల్లంపల్లి రమేశ్, అప్పని పద్మ, షరిఫొద్దీన్, బీఆర్‌ఎస్ నాయకులు సంగ సంపత్, ఏనుగు సత్యవతి, మాక లాజరస్, కీర్తి లత, మారుపాటి మహేందర్‌రెడ్డి, శనిగరం సదానందం, ఎల్తూరి ప్రభాకర్, రచ్చ సంపత్ పాల్గొన్నారు.

– మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్

## కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలి

*మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి*

దామెర, మే 5 : లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని సీతారాంపురంలో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంతో పాటు ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. ఆరు గ్యారెంటీల పేరుతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకువచ్చిన కేసీఆర్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు అన్ని విధాలా మేలు కలిగిందన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ కాగితాల శంకర్, వైస్ ఎంపీపీ జాకీర్ అలీ, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు పోలం కృపాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రామకృష్ణ, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

### • సుధీర్‌కు రిటైర్డ్ ఉద్యోగుల మద్దతు

హనుమకొండ చౌరస్తా, మే 5 : వరంగల్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌కు కడిపికొండకు చెందిన యూనికాన్ ఆర్గాన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రిటైర్డ్ ఉద్యోగులు తమ మద్దతు తెలిపారు. ఆదివారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌ను కలిసి మద్దతు ప్రకటించారు. కేసీఆర్ పాలనలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు లబ్ధి చేకూరిందన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత ఈగ మల్లేశం, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సాధినేని సుధాకర్, ప్రధాన కార్యదర్శి తంగళ్లపల్లి రాంచందర్, వైస్ ప్రెసిడెంట్ నీలం బాలరాజు, డైరెక్టర్ రామంచ చేరాలు, శ్రీపతి సారయ్య, గట్ల భిక్షపతి, చారి, అడిచెర్ల సదానందం పాల్గొన్నారు.



సుధీర్‌కు మద్దతు ప్రకటిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులతో వినయ్‌భాస్కర్

### • గురుద్వారలో సుధీర్‌కుమార్ ప్రత్యేక ప్రార్థనలు



హనుమకొండ చౌరస్తా, మే 5 : వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 6వ డివిజన్ కిషన్‌పుర గురుద్వారలో ఆదివారం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌కుమార్ సిక్కులను మాట్లాడి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నం మధు పాల్గొన్నారు.

### • మా అమ్మను గెలిపించండి

- ఎంపీ కవిత కూతురు, కుమారుడి ప్రచారం



మహబూబాబాద్ రూరల్, మే 5 : బీఆర్‌ఎస్ మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థి మాలోత్ కవిత తరపున ఆమె కూతురు మహతి, కొడుకు నయన్ ఆదివారం పట్టణంలోని కొండపల్లి, గోపాల్‌రావునగర్ కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. వృద్ధులు, దివ్యాంగులను ఆప్యాయంగా పలుకరించి, మా అమ్మను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ మాయమాటలకు మరోసారి మోసపోవద్దన్నారు.

### • బీఆర్‌ఎస్‌ను గెలిపించు తల్లీ!!



### • అమ్మా.. కారును 'గుర్తు'ంచుకో!



కాశీబుగ్గ: బీఆర్‌ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కేతిరి రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం వరంగల్ 14వ డివిజన్ ఎస్‌ఆర్‌నగర్‌లోని బొడ్రాయి, హనుమాన్ ఆలయంలో బీఆర్‌ఎస్ ఎస్‌ఆర్‌నగర్ అధ్యక్షుడు పసులాది మల్లయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.